క్లుప్తంగా

పాఠశాలలో మొక్కలు నాటిన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు


మొక్కలు నాటిన సంస్థ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు

మద్దిపాడు: మండలంలోని రాచవారిపాలెం హరిజనవాడ పాఠశాల ఆవరణలో సన్ హెల్పింగ్ పీపుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆ సంస్థ వ్యవస్థాపకులు ఎస్ శోబాబు, మెంబర్ బోయలపల్లి ప్రభావతి సోమవారం 40 పూల మొక్కలు, పండ్లమొక్కలు నాటారు. ఈ సందర్భంగా హెచ్ఎం శివజీవన్ మాట్లాడుతూ విద్యార్థులకు ఆహ్లాదంతో పాటు నీడనిచ్చే చెట్లను తమ ఫౌండేషన్ ద్వారా నాటడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ టెక్నికల్ ఇంజినీర్ కిషోర్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై శ్రద్ధ వహించండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

ఒంగోలు రూరల్ : పారిశుధ్యానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఒంగోలు ఎంపీడీఓ శ్రీనివాసరావు సిబ్బందిని ఆదేశించారు. ఒంగోలు మండలంలోని గ్రామ పంచాయతీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సోమవారం ఒంగోలు మండల పరిషత్ సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, ఘన వ్యర్థాల నిర్వహణ, గ్రామ అభివృద్ధి ప్రణాళిక తయారీ, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం శిక్షణ కార్యక్రమాలు మొదలయ్యాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ బండి శ్రీనివాసరావు, ఈఓఆర్డీ రమణమ్మ, రిసోర్స్ పర్సన్ రామమోహన్, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు ఎస్.బాబు శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

కాశీవిశ్వనాథుడికి ప్రత్యేక పూజలు

ఒంగోలు మెట్రో: శ్రావణ సోమవారం సందర్భంగా నగరంలోని శైవక్షేత్రాల్లో భక్తిశ్రద్ధలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కేశవస్వామిపేట కాశీవిశ్వనాథుని దేవస్థానంలో, లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న మరకత శివలింగానికి, కొత్తపట్నం బస్టాండ్ దగ్గర శివాలయంలో, మంగమూరు రోడ్డు గాంధీనగర్ మూడో లైన్లో రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో, బాలాజీరావుపేట కనకదుర్గమ్మ ఆలయంలో ఉపాలయంగా ఉన్న దుర్గామల్లేశ్వరస్వామికి, అంజయ్య రోడ్డులో శివసాయి పంచముఖ శివాలయంలో, సమతానగర్ సాగర్ కాల్వ దగ్గర దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో, సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో కాశీ విశ్వేశ్వరునికి, రంగారాయుడు చెరువు దగ్గర అరుణాచలేశ్వరస్వామికి ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. శివలింగాలకు సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. బిల్వార్చన, కర్పూర హారతితో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం మహానందీశ్వరుడికి ధూపదీప హారతులతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

జాతీయజెండా ప్రదర్శన

ఉలవపాడు: ఉలవపాడులో చిన్నారులతో జాతీయజెండా ప్రదర్శన నిర్వహించారు. గ్రంథపాలకుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్యక్రమం నిర్వహించారు. స్వాతంత్ర సమర వీరులను స్మరించుకుంటూ జెండాను పట్టుకుని విద్యార్థులు గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. ముందుగా గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మోనోడాన్.. సాగు డౌన్..!

- మోనోడాన్ సీడ్ అందక ప్రశ్నార్థకంగా మారిన రొయ్యల సాగు
- రాష్ట్రంలో రెండు హేచరీలకే పర్మిషన్
- సీడ్ లేదని చేతులెత్తేసిన హేచరీల యజమానులు
- కొత్తపట్నం మండలంలో 2 వేల ఎకరాల్లో నిలిచిన రొయ్యల సాగు
- చెరువులకు నీరు నింపి సీడ్ కోసం ఎదురుచూస్తున్న రైతులు
- అధికారులు పట్టించుకోవాలని వినతి

కొత్తపట్నం: మోనోడాన్ సీడ్ కొరత రొయ్యల సాగుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కొత్తపట్నం మండలంలో ఏకంగా రొయ్యల సాగే ప్రశ్నార్థకంగా మారింది. మండలంలో వ్యవసాయం తర్వాత రెండో ఆదాయ పంట రొయ్యల సాగు. రొయ్యలు పండించి విదేశాలకు సైతం ఎగుమతి చేసి మండల రైతులు ఆదాయాన్ని పొందుతుంటారు. తద్వారా రాష్ట్రానికే కాకుండా దేశానికి కూడా ఆదాయ వనరుగా కొత్తపట్నం మండలం నిలుస్తుంది. ఎన్నో ఒడిదుడుకులు, ఆటుపోట్లు ఎదుర్కొంటూ మండల రైతులు రొయ్యలు సాగుచేస్తున్నారు. దేశంలో 1998 నుంచి రొయ్యల సాగు ప్రారంభమైంది. అప్పట్లో సముద్రంలో ఉన్న రొయ్య పిల్లలను కూలీలు పట్టుకొచ్చి రొయ్యల యజమానులకు ఇచ్చేవారు. ఆ రొయ్య పిల్లలతోనే సాగు చేసి ఆదాయాన్ని పొందేవారు. అలా కొన్ని సంవత్సరాలు రైతులకు మంచి ఆదాయం వచ్చింది. ఆ తర్వాత తైవాన్ దేశం, చెన్నై నుంచి వైరస్ మన రాష్ట్రానికి పాకింది. దీంతో తెల్లరొయ్య పిల్లలను విడిచిపెట్టి టైగర్ రొయ్యలు సాగు చేశారు. కొన్ని పద్ధతులు పాటించి చెరువులకు బ్లీచింగ్ చేసి కల్చర్‌ను ప్రారంభించారు. సముద్రపు టైగర్ రొయ్య పిల్లల నుంచి రొయ్యల సాగు చేపట్టారు. దిగుబడులు బాగా వచ్చి రైతులకు ఆదాయం చేకూరింది. ఆ తర్వాత టైగర్ హేచరీలు పుట్టాయి. హేచరీల నుంచి సీడ్ ఉత్పత్తి చేసుకుని రొయ్యల సాగు చేస్తూ వచ్చారు. కొంత కాలం తర్వాత టైగర్ రొయ్య పిల్లలు హేచరీల నుంచి సరిగా ఇవ్వనందున రైతులకు భారీగా నష్టం వాటిల్లింది. రెండేళ్ల పాటు కల్చర్ చేయక సాగు నిలుపదల చేశారు. దీంతో వెనామీ రొయ్యల సీడ్‌ను హేచరీలు ఉత్పత్తి చేశాయి. మూడు సంవత్సరాల పాటు వెనామీ రొయ్యలు సాగు చేసి ఆదాయాలు చూశారు. అనంతరం నాసిరకం రొయ్యల సాగు వలన వెనామీ కూడా సరిగా సీడ్ ఇవ్వక రైతులకు నష్టాలు ఎదురయ్యాయి. ఈ క్రమంలో రెండేళ్ల నుంచి మోనోడాన్ టైగర్ రొయ్యలను ఉత్పత్తి చేస్తున్నారు. ఇతర దేశాల నుంచి తల్లి రొయ్యలను దిగుమతి చేసుకుని రొయ్య పిల్లలను ఉత్పత్తి చేస్తున్నారు. 2020 నుంచి 2023 వరకు మోనోడాన్ టైగర్ రొయ్య పిల్లలు బాగానే వచ్చాయి. ఇప్పుడు నాసిరకం రొయ్య పిల్లలు ఉత్పత్తి చేయడం వలన అవి కూడా రైతులకు నష్టాన్నిస్తున్నాయి.

రెండు హేచరీలకే పర్మిషన్ కారణంగా తీవ్ర కొరత...

మోనోడాన్ టైగర్ రొయ్య పిల్లల ఉత్పత్తికి ప్రభుత్వం రాష్ట్రంలో రెండు హేచరీలకే పర్మిషన్ ఇచ్చింది. రాష్ట్రంలో రొయ్యలు సాగుచేసే పొలాలన్నింటికీ సీడ్ సరఫరా చేసేందుకు రెండు హేచరీలే ఉండటం వలన సరిపడా సీడ్ అందించలేకపోతున్నారు. రైతులు ఆ రెండు హేచరీలకు ఎగపడటం వలన నాసిరకం రొయ్య పిల్లలను తయారు చేస్తున్నారు. దీంతో రైతులకు భారీగా నష్టం వాటిల్లుతోంది. మన ప్రాంతంలో పెంచిన తల్లి రొయ్యల చేత గుడ్లు పెట్టించి రైతులకు అంటగడుతున్నారు. చెరువులో వేసిన నెలారెండునెలలకు పెరుగుదల లేక చెరువులను హార్వెస్ట్ చేస్తున్నారు. ఈ క్రమంలో రైతులు కలెక్టర్ నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో అర్జీలిచ్చారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా రైతులు, హేచరీ యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సమస్యలపై అధ్యయనం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

సీడ్ కోసం రైతుల ఎదురుచూపులు...

మోనోడాన్ టైగర్ సీడ్ వస్తుందని రెండు నెలలుగా రొయ్యల రైతులు ఎదురుచూస్తున్నారు. కొత్తపట్నం మండలంలో 2 వేల ఎకరాల్లో రొయ్యలు సాగుచేస్తున్నారు. అందులో మోనోడాన్ టైగర్ మూడు వంతులు సాగు చేస్తున్నారు. మండలంలో ఉన్న పొలాలు మోనోడాన్ టైగర్ రొయ్య పిల్లల సాగుకు అనుకూలంగా ఉంటాయి. అందువలన చెరువులకు నీరు నింపుకుని మోనోడాన్ టైగర్ రొయ్య పిల్లల కోసం ఎదురు చూస్తున్నారు. హేచరీ యజమానులు మాత్రం ఆ సీడ్ లేదని చేతులెత్తేశారు. దీంతో రైతులకు ఏం చేయాలో అర్థంగాని పరిస్థితి నెలకొంది. అధికారులు చర్యలు తీసుకుని ఎక్కువ హేచరీలకు మోనోడాన్ టైగర్ రొయ్య పిల్లల సరఫరాకు పర్మిషన్ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.


ఖాళీగా ఉన్న రొయ్యల చెరువు


హేచరీలో రొయ్య పిల్లలను తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)


నీరు నింపుకుని మోనోడాన్ రొయ్య పిల్లల కోసం ఎదురుచూస్తున్న చెరువు

రొయ్యల చెరువులకు నీరు నింపుకుని ఎదురు చూస్తున్నాను



రొయ్యల చెరువులో నీరు నింపుకుని రెండు నెలల నుంచి ఎదురుచూస్తున్నాను. నా చెరువులకు మోనోడాన్ టైగర్ రొయ్య పిల్లలు మాత్రమే పనికొస్తాయి. రెండు నెలలు చెరువులో నీరు ఉండటం వలను చెరువులో పాచిపట్టి దుర్వాసన వస్తోంది. ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఎక్కువ హేచరీలకు మోనోడాన్ టైగర్ రొయ్య పిల్లల ఉత్పత్తికి అనుమతులు ఇవ్వాలని కోరుతున్నాను.

– కోదూరి శ్రీనివాసరెడ్డి, మోటుమాల

మోనోడాన్ టైగర్ రొయ్య పిల్లలు మాత్రమే అనుకూలం



సముద్రంలో నుంచి వచ్చే నీరు 30 ఉప్పుశాతంతో ఉంటుంది. అందులో మోనోడాన్ రొయ్య పిల్లలు మాత్రమే సెట్ అవుతాయి. వేరే రొయ్య పిల్లలు సెట్ కావు. గతంలో అనేక రకాల రొయ్య పిల్లలు వేయడం వలన సెట్ కాలేదు. రాష్ట్రంలో ఎన్నో హేచరీలు ఉన్నాయి. కానీ, మోనోడాన్ రొయ్య పిల్లలు తయారు చేసే హేచరీలు రెండే ఉన్నాయి. ఇప్పుడు ఏం చేయాలో అర్థం కావడం లేదు. అధికారులు ఎక్కువ మోనోడాన్ హేచరీలకు అనుమతులిచ్చి రైతులను కాపాడాలి.

– బత్తల శ్రీరాములరెడ్డి, మోటుమాల

మద్యానికి అలవాటుపడితే జీవితం నాశనం

- ఒంగోలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు


నశాముక్తి అభియాన్ అవగాహన కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న జీజీహెచ్ సిబ్బంది

ఒంగోలు టౌన్: మద్యానికి అలవాటుపడితే జీవితం నాశనమవుతుందని, భవిష్యత్తు దెబ్బతింటుందని స్థానిక మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు తెలిపారు. సోమవారం స్థానిక మెడికల్ కళాశాల వద్ద నశాముక్తి అభియాన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మద్యానికి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు అలవాటుపడితే భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటుపడి జీవితాలను పాడుచేసుకోవద్దని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ చెప్పారు. విద్యార్థులు అన్నిరకాలుగా బావోద్రేకాలపై అవగావహన కల్పించుకోవాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బీ తిరుమలరావు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రదీప్, వెంకటేశ్వర్లు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు, ర్యాలీకి వచ్చిన వారిచేత ప్రతిజ్ఞ చేయించారు.

మాదక ద్రవ్యాలపై వైద్యులు అవగాహన కల్పించాలి...

మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల బారిన పడకుండా యువతలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాదేవి అన్నారు. స్థానిక జీజీహెచ్‌లో నిశాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మద్యం, మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. సమాజాన్ని మాదక ద్రవ్యాలు పట్టిపీడిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యానికి అడిక్ట్ అవుతున్న విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తును చేజేతులా దెబ్బ తీసుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ బాలాజీ నాయక్, డాక్టర్ ప్రభాకర్‌రావు, జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ కళ్యాణి, ఆర్ఎంఓ డాక్టర్ చెంచయ్య, నర్సింగ్ సూపరింటెండెంట్ సంపూర్ణమ్మ, నర్సింగ్ స్కూలు ప్రిన్సిపాల్ సుమిత్రాదేవి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిర్వహణ పేరుతో నిధులు స్వాహా

మద్దిపాడు: పంచాయతీ నిర్వహణ ఖర్చుల పేరుతో లక్షల రూపాయలు డ్రా చేసుకుని స్వాహా చేస్తున్న విషయం మద్దిపాడు మండలంలోని సీతారాంపురం పంచాయతీలో వెలుగుచూసింది. గ్రేడ్–2 పంచాయతీ అయిన సీతారాంపురం పంచాయతీకి జనరల్ ఫండ్ ఎక్కువగా వస్తుంది. గతంలో పనిచేసిన ఎంపీడీఓ పెదకొత్తపల్లి గ్రామ కార్యదర్శిగా పనిచేస్తున్న వ్యక్తిని సీతారాంపురం గ్రామానికి ఇన్‌చార్జిగా నియమించడంతో ఆ కార్యదర్శి పంచాయతీ నిధులను తన ఇష్టానుసారంగా డ్రాచేశారు. 2023 జూలైలో టర్న్‌కాక్, క్లాప్‌మిత్ర, కార్యాలయ నిర్వహణ ఖర్చులు చూపి రూ.46,000 డ్రా చేశారు. సెప్టెంబర్‌లో గ్రామంలో పారిశుధ్య పనులు చేసినట్లు చూపుతూ రూ.20,000, అదే నెలలో మరోసారి కార్యాలయ నిర్వహణ, పారిశుధ్య పనుల నిర్వహణ కింద రూ.44,460 డ్రా చేశారు. సీతారాంపురం వాటర్ షెడ్ నిర్మాణం పేరిట రూ.4,20,615, డిసెంబర్‌లో టర్న్ కాక్, స్వీపర్, క్లాప్‌మిత్రలతో పాటు కార్యాలయ నిర్వహణ ఖర్చు అంటూ రూ.49,058 డ్రా చేశారు, ఎన్నికల కోడ్ వస్తే తనను ఎవరూ పట్టించుకోరన్న ధీమాతో 2024 జనవరి నెలలో కార్యాలయ నిర్వహణ, టర్న్‌కాక్ క్లాప్ మిత్రల జీతాలంటూ రూ.41,350 డ్రాచేశారు. ఫిబ్రవరిలో శానిటేషన్ మెటీరియల్ కొనుగోలుకు, వీధిదీపాల కొనుగోలుకు రూ.1,00,500, టర్న్‌కాక్, క్లాప్‌మిత్ర జీతాలు వీధిలైట్ల రిపేరు, కార్యాలయ నిర్వహణ ఖర్చుల కింద రూ.49,192 డ్రా చేశారు. మార్చి నెలలో టర్న్‌కాక్, స్వీపర్, పారిశుధ్య పనులు చేయించినందుకు, వీధిదీపాల రిపేర్ల పేరుతో రూ.78,760 నిధులు డ్రాచేశారు. ఫిబ్రవరిలో వీధి దీపాలు కొనుగోలు చేయగా 20 రోజుల వ్యత్యాసంతో విద్యుత్ దీపాల రిపేర్ల ఖర్చు అంటూ నిధులు డ్రా చేయడం, మార్చి నెలలో కూడా రిపేర్ల పేరిట డబ్బు డ్రా చేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. పంచాయతీలో ఏనాడూ ఏ కార్యక్రమాలూ చేపట్టకపోగా, సిబ్బందికి కనీసం ఫైళ్లు, ఫోల్డర్లు, వైట్ పేపర్లు కూడా ఇవ్వడం లేదని సిబ్బంది పలుమార్లు ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ, కార్యాలయ నిర్వహణ ఖర్చు పేరిట నెలనెలా డబ్బు డ్రాచేయడం, స్వీపర్ కాకుండా ఇద్దరు క్లాప్‌మిత్రలు, ఒక టర్న్ కాక్ ఉండగా, నలుగురి జీతాలు డ్రాచేస్తున్నట్లు సమాచారం. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే కాగా, సదరు కార్యదర్శి మండలంలో విధులు నిర్వహిస్తున్న సమయం నుంచి పూర్తి స్థాయిలో విచారిస్తే లక్షల రూపాయలు గోల్‌మాల్ అయినట్లు తెలిసిపోతుందని పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

‘మీ కోసం’ వచ్చాం.. ‘మా కోసం’ వెళ్తున్నాం!


మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ ఒక్కరే ఉన్న దృశ్యం

సింగరాయకొండ: మీ కోసం కార్యక్రమంలో అధికారుల హాజరు తీరుపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమానికి మూడు అర్జీలు వచ్చాయి. సోమరాజుపల్లికి చెందిన వ్యక్తి తన భూమికి హద్దులు చూపించాలని, బింగినపల్లికి చెందిన రైతు తన పొలానికి నీరు రాకుండా పంట కాలువను పూడ్చారని, సర్వే చేసి పంట కాలువను పునరుద్ధరించి ఆదుకోవాలని, పాకలకు చెందిన వ్యక్తి సర్వే నంబర్ 44లోని స్థలాన్ని శ్మశాన వాటికకు కేటాయించాలని అర్జీ ఇచ్చారు. కార్యక్రమానికి మత్స్యశాఖ, వ్యవసాయశాఖ, విద్యుత్, గృహనిర్మాణ శాఖ, పశువైద్యాధికారి, ఏపీఎం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ హాజరైనప్పటికి వీరు కేవలం కొంతసేపు మాత్రమే ఉండి వెళ్లిపోయారని ప్రజలు విమర్శిస్తున్నారు. కేవలం ఇన్‌చార్జి తహసీల్దార్ తన్నీరు వెంకటేశ్వరరావు మాత్రమే ఈ కార్యక్రమంలో చివరి వరకు ఉన్నారు. వాస్తవానికి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొనాల్సి కొందరు చుట్టపు చూపుగా వచ్చి వెళ్లడం విమర్శలకు తావిచ్చింది.

సెల్‌టవర్ పనుల అడ్డగింత

- కమిషనర్ వైఖరిపై ప్రజల నిరసన


నిరసన తెలుపుతున్న వార్డు ప్రజలు

కనిగిరి రూరల్: పట్టణంలోని కొత్తపేట ఆర్టీసీ డిపో ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్‌ను సోమవారం స్థానికులు అడ్డుకున్నారు. సెల్ టవర్ ఏర్పాటుతో అనారోగ్య సమస్యలు వస్తాయని, రేడియేషన్ ప్రభావంతో తీవ్ర దుష్పరిణామాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆరోపిస్తూ నినాదాలు చేస్తూ పనులను అడ్డుకున్నారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న కమిషనర్ సెల్‌టవర్ నిర్మాణం వల్ల ఎటువంటి నష్టం లేదని యధావిధిగా పనులు చేయాలని సంబంధిత టవర్ నిర్మాణ దారులకు తెలిపారు. దీంతో స్థానికులు కమిషనర్ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆందోళన చేస్తుంటే పట్టించుకోకుండా కమిషనర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు.

రాజకీయ వేధింపులతో వీవోఏలను తొలగించడం సరికాదు


ఏపీఎంకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

నాగులుప్పలపాడు: రాజకీయ కక్ష సాధింపులు, వేధింపులతో మండల వ్యాప్తంగా గ్రామ సమైక్య సంఘం వీవోఏలను తొలగించడం సరికాదని సీఐటీయూ నాయకులు శ్రీకాంత్, బసవపున్నయ్య అన్నారు. మండలంలోని తిమ్మసముద్రం గ్రామంలో శ్రీషిరిడీ సాయిబాబా గ్రామైక్య సంఘానికి సంబంధించి వీవోఏగా రాచూరి మాధవి పనిచేస్తోందని, ఆమెను రాజకీయ కక్ష సాధింపులో భాగంగా గ్రామంలోని మహిళా సంఘాలకు కూడా తెలియకుండా తీసివేయడం జరిగిందని అన్నారు. ఇది సరైన చర్య కాదంటూ సోమవారం గ్రామంలోని 36 గ్రూపుల లీడర్లతో వెలుగు కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రూపు లీడర్లతో సంబంధం లేకుండా వీవోఏను మార్చడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. వెంటనే గ్రామంలోని గ్రూపు సభ్యులతో సమావేశం నిర్వహించి మెజార్టీ సభ్యుల అభిప్రాయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం హనుమంతరావుకు వినతి పత్రం అందజేశారు.

పట్టణంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

కందుకూరు: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్వాతంత్ర్య దిన వేడుకలను పురస్కరించుకుని సహకార శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేపట్టారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సబ్ కలెక్టర్ విద్యాధరి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల గురించి ప్రతి విద్యార్థికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, దేశ వ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా ఉత్సవాలు జోరుగా సాగుతున్నాయని చెప్పారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయం నుంచి పోస్టాఫీస్ సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. సహకార శాఖాధికారి కేవీ సుబ్బారావు, బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం నరశింహమూర్తి, డీటీ బ్రహ్మయ్య, కె.లక్ష్మీప్రసన్న, పీడీసీసీ బ్యాంకు సిబ్బంది, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సిబ్బంది పాల్గొన్నారు.


భాగ్యనగర్ 3వ లైన్‌లో చెత్త తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది




భాగ్యనగర్ 2వ లైన్‌లో కాలువలో పూడిక తీస్తున్న జేసీబీ


భాగ్యనగర్ 3వ లైన్‌లో...

పలుచోట్ల పారిశుధ్య పనులు

సాక్షి ఎఫెక్ట్..

ప్రభుత్వం మారిన తర్వాత ఒంగోలు నగరంలో పారిశుధ్యం పడకేసింది. పారిశుధ్య పనులపై పర్యవేక్షణ లేకపోవడంతో ఎక్కడ చూసినా చెత్తాచెదారం, మురుగు నిల్వలు పేరుకుపోయాయి. ఖాళీ స్థలాలన్నీ కూడా వాటితోనే నిండిపోయాయి. దీనిపై సాక్షి దినపత్రిక ఒంగోలు క్లస్టర్ పేజీలో ఈ నెల 11వ తేదీ ‘ఖాళీ స్థలాలన్నీ కంపు కంపు’ అనే శీర్షికతో ఫొటోలతో కథనం ప్రచురితమైంది. ఆ కథనానికి నగరపాలక సంస్థ అధికారులు స్పందించారు. సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో కాలువల్లో పూడిక తీయించారు. చెత్తాచెదారం తొలగించారు.

– సాక్షి, ఒంగోలు